


బావిలో ఈత కొడుతున్న యువకులు

ఈత సరదా.. జాగ్రత్త

యాదమరి: వేసవి సెలవులు మొదలైంది అంటే చాలు పిల్లలు, యువకులు బావులు, చెరువులు వెతుక్కుంటూ పోయి ఈతతో మునిగితేలుతారు. అయితే ఆ ఈత సరదా కొన్ని సందర్భాల్లో ప్రాణాలు తీస్తుంది. అందుకే దీనిపై జాగ్రత్తగా ఉండాలి. నీటి వనరులపై సరైన అవగాహన లేక పోవడంతో పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కన్నవారికి కన్నీటి వ్యథను మిగుల్చుతున్నారు. కొంతమంది మద్యం తాగి తమ సరదా కోసం చేపలు పట్టడానికి వెళ్లి చెరువులు, బావుల్లో జారి పడి మునిగి అర్ధాంతరంగా తనువును చాలిస్తున్నారు. ఇలా ప్రతి ఏడాది వేసవి కాలంలో పదుల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తతతో కంట కనిపెట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిపుణుల సూచనలు

- రైతులు తమ పొలం గట్లుపై ఉన్న బావుల వద్ద కంచె ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా ఈత కోసం బావుల వద్దకు ఎవరూ రాకపోవడంతో కొంత మేరకు ప్రమాదాలు నివారించవచ్చు.
- ఈ సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక కంట కనిపెట్టాలి.
- ఈత కోసం వెళ్లాల్సివస్తే తప్పకుండా పెద్దవాళ్లు లేదా అనుభవజ్ఞులతో పంపాలి.
- ఈత నేర్చుకునేవారు నడుముకు ట్యూబులు వంటి రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలి.
- అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదు.
- నీటి అడుగు భాగంలో ఉన్న మట్టిని తీసుకు రావడానికి పందేలు వేసుకోవడం వంటివి చేయరాదు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: నగర పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల నిర్వహణ చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కోర్టు చుట్టుపక్కల ప్రాంతాలు, గాంధీ రోడ్డు, బజారువీధి, జెండామానువీధి, మార్కెట్‌వీధి, మురకంబట్టు, వెంగనపల్లె తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాలని వివరించారు.

శక్తి యాప్‌తో యువతులకు రక్ష



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

చిత్తూరు రూరల్: శక్తియాప్ మహిళలు, యువతులకు రక్షగా ఉంటుందని మహిళా ఎస్‌ఐ కరిమునిస్సా పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నర్సింగ్ హాస్టల్లో ఆమె శుక్రవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తియాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఈయాప్‌ను వినియోగించుకోవచ్చని చెప్పారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులతో ఈ శిబిరం కంటి పరీక్షలు చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

లైసెన్సు మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సులభంగా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి ఆసక్తి ఉన్న టెక్నికల్ సర్వేయర్లు, ఇంజినీర్లు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. ఐటీఐలో సివిల్, డిప్లమో సివిల్, బి.టెక్ (సివిల్) పూర్తి చేసిన అభ్యర్థులు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికి లైసెన్సులు మంజూరు చేస్తామని, తద్వారా ప్రజలకు స్వీయ ధృవీకరణ పత్రంతో భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేస్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా పథకాలు వర్తింపచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

గుడిపాల: ప్రతి ఒక్కరికీ బీమా పథకాన్ని వర్తింపచేయాలని ఎంపీడీవో కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్ర వారం పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలతో పాటు గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా చేయించాలన్నారు. బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా సంవత్సరానికి రూ.20, ప్రధానమంత్రి సురక్ష యోజనన కింద రూ.436 చెల్లించినట్లయితే సాధారణ మరణానికి రూ.2లక్షలు అందజేయనున్నట్లు చెప్పారు. వీటన్నింటినీ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన వారికి సూచించారు.

ఘనంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

కాణిపాకం: త్రయోదశిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైనా శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం నందీశ్వరుడి పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ ప్రదోష పూజలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తి ప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రుణాలను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న కుమార్

గుడిపాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం పర్సన్ ఇన్‌చార్జ్ కేవీ ఆర్ కుమార్, వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సహకార సంఘంలో శుక్రవారం రైతులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సహకార సంఘంలో రైతులు రుణాలు ఎలా పొందాలి? ఎలాంటి హామీ పత్రాలు సమర్పించాలో వివరంగా వారికి తెలియజేశారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లోని రైతులకు ఈ విషయంపై తెలియజేయాలన్నారు. భూములు కలిగిన రైతులకు బంగారంపై కూడా రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఈఓ పట్టాభి, బ్యాంక్ సూపర్ వైజర్ ధనంజయరెడ్డి, సిబ్బంది సెల్వం, జితేంద్ర, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వరం.. ప్రధాన మంత్రి బీమా



మాట్లాడుతున్న ఎంపీడీఓ రెడ్డిబాబు

తవణంపల్లె: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం వరమని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. స్థానిక ఈజీఎస్ కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవన జ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష భీమా పథక కింద ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలన్నారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు వరకు అర్హులన్నారు. ప్రమాదం జరిగితే ఈ పథకం కింద రూ.2 లక్షల వరకు నష్టపరిహారం అందుతుందని వివరించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 50 ఏళ్ల లోపు వారు అర్హులని వివరించారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.436 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ పథకం కింద సహజ మరణానికి జీవిత బీమా రక్షణ కింద రూ.2 లక్షలు అందుతాయని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీఓ బాల మాట్లాడుతూ ఉపాధి కూలీలు రెండు బీమా పథకాల కింద ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రవి, బ్యాంకు అధికారులు, ఉపాధి సిబ్బంది, శ్రామికులు పాల్గొన్నారు.

ఒకే కేంద్రంలో డిగ్రీ, బీఈడీ పరీక్షలు

- పీవీకేఎన్ కళాశాలలో వసతుల కొరత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న డిగ్రీ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : డిగ్రీ చదువుతున్న విద్యార్థుల నుంచి యూనివర్సిటీ అధికారులు, పీవీకేఎన్ అటానమస్ కళాశాలలు వేల కొద్ది పరీక్ష ఫీజులు చెల్లించుకున్నారు. నిబంధనల ప్రకారం పరీక్ష ఫీజులు విద్యార్థుల నుంచి కట్టించుకున్న తర్వాత పరీక్ష కేంద్రాల్లో మౌళిక వసతులు పకడ్బందీగా కల్పించాల్సి ఉంటుంది. అయితే జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో పరీక్షల నిర్వహణ తీరు గందరగోళంగా మారింది. ఒకేసారి ఎస్వీ యూనివర్సిటీ డిగ్రీ, పీవీకేఎన్ అటానమస్, బీఈడీ కోర్సులకు సంబంధించిన పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల నిర్వహణ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీవీకేఎన్ కళాశాల కేంద్రంలో వేల సంఖ్యలో ఒకేసారి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండడంతో సమస్యలు అధికమవుతున్నాయి.

ఉక్కపోతలో పరీక్షలు

ప్రస్తుతం ఉదయం 9 గంటల నుంచి అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోని తరగతి గదుల్లో ఫ్యాన్‌లు తిరగకపోవడంతో ఉక్కపోత నడుమ మూడు గంటల పాటు పరీక్షలు రాశారు. కళాశాలలోని మరుగుదొడ్లు శుభ్రం చేయక పోవడంతో దుర్గంధం వెదజిల్లుతోందని విద్యార్థులు వాపోయారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పీవీకేఎన్ పరీక్ష కేంద్రం వద్ద పరీక్షలు రాసేందుకు హాజరవుతున్న విద్యార్థులు



ఒకే బెంచ్‌పై ఇద్దరు చొప్పన పరీక్షలు రాస్తున్న డిగ్రీ విద్యార్థులు

ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తించం

నిబంధనల ప్రకారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు పరీక్ష విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే కొంత మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన అధ్యాపకులు రుబాబు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షలు నిర్వహిస్తే తాము ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తించలేమంటూ తప్పించుకుంటున్నట్లు సమాచారం. లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న అధ్యాపకులు ఇన్విజిలేషన్ చేయకుండా తప్పించుకోవడం పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొంత మంది తిరుపతి జిల్లా నుంచి రోజు రాకపోకలు చేయాలంటూ తప్పించుకుంటున్నారు. దీంతో అతిథి అధ్యాపకుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నిబంధనలు తూచ్

పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు డిగ్రీ రెండవ సెమిస్టర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు, బీఈడీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు వందల సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. వేలాది రూపాయలు పరీక్ష ఫీజు కట్టించుకునే యూనివర్సిటీ అధికారులు పరీక్ష కేంద్రంలో తగిన వసతులు కల్పించడంలో విఫలమయ్యారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బీఈడీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

అరణ్య రోదన




చిత్తూరు నగరంలోని రిజర్వు ఫారెస్టు (నగరవనం)లో మూగ జీవాలకు పెద్ద కష్టమే వచ్చి పడింది. ఇక్కడున్న వేలాది హెక్టార్లలోఅడవి జంతువులు చాలానే ఉన్నాయి. చుక్కల జింకలు, దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, కోతులు.. ఇలా వేలాది ప్రాణులున్నాయి. ఆహారమైతే అడవిలో దొరుకుతుంది. కానీ ప్రస్తుతం అడవి జంతువులకు నీళ్ల కష్టమొచ్చింది. వేసవిని దృష్టిలో ఉంచుకుని రూ.లక్షలు వెచ్చించి నగరవనంలో నీళ్ల తొట్టెలు నిర్మించిన అధికారులు.. వీటిలో నీళ్లను నింపడంలేదు. ఫలితంగా అడవి జంతువులు నీళ్ల కోసం జనావాసాల మధ్యకు వచ్చి, కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. తమకు దాహంగా ఉందని జీవాలైతే అడగలేవు. నగరవనంలో పర్యటించి నీటి నింపాల్సిన అధికారులు మౌనంగా ఉండడం విమర్శలకు తావిస్తోంది.

– చిత్తూరు అర్బన్

రెండు ప్రాంతాల్లో చోరీలు

చిత్తూరు అర్బన్: నగర శివారుల్లోని రెండు ప్రాంతాల్లో జరిగిన చోరీలు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. తాలూక పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ కాలనీకి చెందిన నరసింహులు శెట్టి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లి, గురువారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. ఉదయం లేచి బెడ్‌రూమ్ తీయడానికి ప్రయత్నిస్తే లోపల గడియ పెట్టి ఉండడంతో, కిటికీలోంచి చూశాడు. బాత్‌రూమ్ వెంటిలేటర్ పగులగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువా తెరచి అందులో ఉన్న రూ.2 లక్షల నగదు, 25 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో వరకు వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించాడు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మురకంబట్టులోని గోడౌన్‌లో గురువారం రాత్రి బొలేరో వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు, గోడౌన్ తాళాలు పగులగొట్టి అక్కడున్న ఏడు బస్తాల గుట్కా, పొగాకు ఉత్పత్తులను చోరీ చేశారు. వీటి విలువ రూ.2.8 లక్షల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

పేడ దిబ్బల తొలగింపు



పేడదిబ్బలను తొలగిస్తున్న జేసీబీ

గుడిపాల: పరిసరాల శుభ్రతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. మరకాలకుప్పం, శ్రీరంగంపల్లె గ్రామాల్లో శుక్రవారం రోడ్ల పక్కన ఉన్న పేడదిబ్బలను జేసీబీల సాయంతో ఆయన తొలగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా కూడా పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూసేందుకు సచివాలయ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శుభ్రతే ఆరోగ్యకర జీవితానికి నాంది

యాదమరి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకర జీవితానికి తొలి అడుగు అని ఈఓపీఆర్డీ సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని బుడితిరెడ్డిపల్లి, అత్తిగారిపల్లి గ్రామపంచాయతీలో పర్యటించారు. సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ గృహస్తులు తడి చెత్తను, పొడి చెత్తను ఇంటిలో నిల్వ చేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న చెత్త, పేడ దిబ్బలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ

చిత్తూరు అర్బన్: కశ్మీర్‌లో ముష్కరులు భారతీయులపై కాల్పులు జరిపి, హత్యలు చేయడాన్ని నిరసిస్తూ చిత్తూరులో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. ఉగ్రవాద చర్యలను తప్పుపడుతూ శనివారం కూడా విధులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఉగ్రవాదుల ఏరివేతకు కేంద్రం కఠినంగా వ్యవహరించాలని బార్ నేతలు డిమాండ్ చేశారు.

పరిసరాల శుభ్రతతోనే మలేరియా నివారణ



గుడిపాల: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిత్తూరు అర్బన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మలేరియాను నివారించవచ్చని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో శుక్రవారం కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల లార్వాలను చంపే మందులను చల్లారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో పెద్ద ఎత్తున నీటిని నిల్వ లేకుండా చూసుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించడానికి మలేథియాన్, ఆయిల్ బాల్స్ నీటి నిల్వ ప్రాంతాలు, కాలువల్లో వెదజల్లుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

లార్వా దశలోనే అంతమొందించాలి

తవణంపల్లె: దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే అంతమొందించాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తవణంపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. దోమ కాటు వల్లే ప్రమాదకర వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. డెంగీ జ్వరం, మలేరియా సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా వేపాకు పొగ వేయాలని, దోమ తెరలు వాడాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ టి.ఎస్.మోహన్‌వేలు, డాక్టర్ పి.కేశవ నారాయణ, సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, రెడ్డెమ్మ, శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గుడిపాల: పరిసరాల శుభ్రతతో మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవంపై శుక్రవారం ఆరోగ్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేసి పరిసరాల శుభ్రత– దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలసూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమ కాటుతో ప్రాణాంతక జ్వరాలు

యాదమరి: చిన్న చిన్న దోమల కాటు వలన ప్రాణాంతక జ్వరాలు వ్యాప్తి చెందుతాయని మండల వైద్యాధికారి డా.అనిల్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని ప్రాథమిక కేంద్రం వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




చిత్తూరు అర్బన్: దోమల నివారణ మందులు చల్లుతున్న కమిషనర్, తవణంపల్లెలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఉగ్రదాడిలో మృతులకు నివాళి



ర్యాలీ చేస్తున్న యువకులు

బంగారుపాళెం: కశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున యువకులు కొవ్వొత్తులు ర్యాలీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జాతీయ రహదారి మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ వెలుగుతున్న కొవ్వొత్తులను చేతపట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. విహారయాత్రకు వెళ్లి ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళులర్పించారు.